


మంగళవారం 16 జూన్ 2026 పేజీలు : 16

# జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గం



విదేశీ భాషలు, ముఖ్యంగా జర్మన్ భాషను నేర్చుకునే విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగాలని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సూచిం చారు. టామ్‌కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో సోమవారం మంత్రి సమావేశమయ్యా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జర్మనీలో ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో ఉన్న యువత కోసం టామ్‌కామ్ జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు.




ప్రైవేట్ విద్యాసంస్థల

# నయా దందా

చెప్పేది కొండంత...

చేసేది గోరంత!

విద్యా సంస్థల్లో కనిపించని

ఆటస్థలం, లైబ్రరీ, ల్యాబ్లు

బట్టి చదువులపై శ్రద్ధ...

క్రీడలపై అనాసక్తి

15

# మద్యపాన నిషేధం కోరుతూ..

**వేంపల్లి గ్రామస్తుల బైఠాయింపు రాస్తారోకో, నిరసనతో భారీ ట్రాఫిక్ జామ్**

**నిలిచిపోయిన వాహనాలు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు:**

**పరిస్థితి అదుపులోకి తెచ్చే ప్రయత్నం మద్యం నియంత్రణకు:**

**వెంటనే చర్యలు చేపట్టాలని వేంపల్లి గ్రామస్తుల డిమాండ్:**

**జూన్ 15, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:బి**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండల కేంద్రంలోని వేంపల్లి గ్రామస్తులు సిర్పూర్ (టి) కాగజ్ నగర్ ప్రధాన రహదారిపై బైఠాయింపు మద్యపాన నిషేధం కోరుతూ.. వేంపల్లి గ్రామస్తులు నిరసనతో ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం నియంత్రించడా నికి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మద్య పానంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన రహదారి రోడ్డుపై నిరసన వేయడంతో భారీ ట్రాఫిక్ జామ్ గంటన్నర పాటు స్తంభించిన ప్రధాన రహదారి నిలిచిపోయిన వాహనాలు



రాకపోకలకు అంతరాయం మద్యం విక్రయాలు, మద్యపానం వల్ల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆందోళన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. పరిస్థితి అదుపులోకి తెచ్చే ప్రయత్నం మద్యం నియంత్రణకు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్

## బీజేపీ అధికారిక కార్యక్రమాలపైనే వార్తలు ప్రచురించాలి

**మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్**



**మంచిర్యాల, 15, జూన్ (ప్రజా జ్యోతి):**గత కొద్ది రోజులుగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లో ఎలాంటి అధికారిక బాధ్యతలు లేని కొందరు వ్యక్తులు వ్యక్తిగత అవసరాల కోసం పార్టీ పేరుతో ప్రత్యేక విలేకరుల సమావేశాలు నిర్వహిస్తున్నారని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ సోమవారం తెలిపారు. పార్టీ మండల అధ్యక్షులకు లేదా జిల్లా నాయకత్వానికి సమాచారం ఇవ్వకుండా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను బీజేపీ అధికారిక కార్యక్రమాలుగా పరిగణించరాదని ఆయన స్పష్టం చేశారు. అటువంటి సమావేశాల్లో వ్యక్తం చేసే అభిప్రాయాలు, వ్యాఖ్యలతో భారతీయ జనతా పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చెశారు .కావున బాధ్యత లేని వ్యక్తులు నిర్వహించే కార్యక్రమాలను బీజేపీ కార్యక్రమాలుగా ప్రచురించవద్దని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. బీజేపీ అధికారిక విలేకరుల సమావేశాలు, మీడియా కార్యక్రమాల గురించి సమాచారం ఇవ్వాల్సి వచ్చినప్పుడు తెలంగాణ మీడియా ప్యానలిస్ట్ తుల ఆంజనేయులు, మీడియా ఇన్‌చార్జి పల్లి రాకేష్, ఐటీ ఇన్‌చార్జి కిషోర్, సంబంధిత జోనల్ లేదా మండల అధ్యక్షులు, జిల్లా బాధ్యుల ద్వారా మాత్రమే సమాచారం అందజేయబడుతుందని తెలిపారు. అలాగే పార్టీ కార్యక్రమాలు, మీడియా సమావేశాలకు సంబంధించిన అధికారిక సమాచారం బీజేపీ జిల్లా ప్రెస్ గ్రూప్ ద్వారా మీడియా ప్రతినిధులకు తెలియజేయబడుతుందని నగునూరి వెంకటేశ్వర గౌడ్ వివరించారు .

## విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ





**నేరడిగొండ, జూన్ 15( ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ హైస్కూల్ ను సోమవారం గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి ఘనంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులందరినీ జడ్పీ హైస్కూల్‌లోనే చేర్పించాలని కోరారు. వచ్చే ఏడాది నుండి ఈ పాఠశాల ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో 'పబ్లిక్ స్కూల్'గా ఆధునీకరించబడుతుందని వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ తెలిపారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి లేదా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వీడీసీ అధ్యక్షులు ఏలేటి రవీందర్ రెడ్డి హామీ ఇచ్చారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు వాడుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు పద్మ కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాబ్ అప్లికేషన్ ఫీజును తగ్గించాలి

### బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్

### నిరుద్యోగులపై అదనపు భారం మోపొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**మంచిర్యాల, 15, జూన్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లకు దరఖాస్తు ఫీజులను భారీగా పెంచిన నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంచిర్యాల లో సోమవారం ఆయన మాట్లాడుతూ, గతంలో సుమారు రూ.200గా ఉన్న ఉద్యోగ దరఖాస్తు ఫీజును ఏకంగా రూ.1000కు పెంచడం నిరుద్యోగ యువతపై అదనపు ఆర్థిక భారం మోపినట్లేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల నుంచి ఒక్క పైసా కూడా తీసుకోబోమని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం అధిక ఫీజులు విధించడం ద్వారా నిరుద్యోగ యువతను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం వేలాది మంది నిరుద్యోగ యువకులు హాస్టళ్లు, అద్దె గదుల్లో ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారని, కుటుంబాలపై ఆధారపడి లేదా అప్పులు చేసి చదువుకుంటున్న వారికి ఫీజుల పెంపు మరింత భారంగా మారిందని తెలిపారు. ఒకే అభ్యర్థి అనేక ఉద్యోగ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో, ప్రతి దరఖాస్తుకు రూ.1000 చొప్పున చెల్లించడం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. నిరుద్యోగుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెంచిన జాబ్ అప్లికేషన్ ఫీజులను వెంటనే తగ్గించాలని, నిరుద్యోగులకు అనుకూలమైన విధానాలను అమలు చేయాలని నరెడ్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగ నియామక ప్రక్రియను పారదర్శకంగా, అందుబాటులో ఉండే విధంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

## బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

### జూన్ 20న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### చట్టబద్ధమైన మార్గంలో వివాదాల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**మంచిర్యాల, 15, జూన్ (ప్రజాజ్యోతి):** బాధితుల నుంచి అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, చట్టప్రకారం వాటిని వేగవంతంగా పరిష్కరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని సిపి అన్నారు. సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతాయుతంగా స్వీకరించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. అదే సందర్భంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ గురించి ప్రస్తావించిన కమిషనర్, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ న్యాయ సంబంధిత సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు శాంతియుతంగా, రాజీ మార్గంలో పరిష్కారమవుతాయని తెలిపారు. రాజీకి అనువైన క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన, కుటుంబ మరియు వైవాహిక కేసులు, బ్యాంకు బకాయిల వసూళ్లు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు వంటి అంశాల్లో ఇరుపక్షాలు పరస్పరం చర్చించుకొని లోక్ అదాలత్ ద్వారా రాజీకి రావచ్చని తెలిపారు .చిన్నచిన్న వివాదాల కారణంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని శాంతియుత పరిష్కారం పొందాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పరిధిలోని పోలీసు అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుళ్లు మరియు ఇతర పోలీసు సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించి, రాజీకి అనువైన కేసులను గుర్తించాలని ఆదేశించారు. ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, రాజీ కుదిరేలా కృషి చేయాలని సూచించిన కమిషనర్, తమ కేసుల్లో రాజీ కావాలని కోరుకునే వ్యక్తులు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా వివాదాలు త్వరితగతిన పరిష్కారమై బాధితులకు సత్వర న్యాయం అందుతుందని అన్నారు. లోక్ అదాలత్‌పై ప్రజలకు సూచనలు చేశారు . ఇరుపక్షాల సమ్మతితోనే రాజీ సాధ్యమవుతుందని, లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ చట్టపరంగా తుది తీర్పుగా పరిగణించబడుతుందని, ప్రతి కేసులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల సమన్వయంతో పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందన్నారు . ప్రజలు, పోలీసు శాఖ, న్యాయస్థానాలు సమన్వయంతో పనిచేస్తే చిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారకముందే పరిష్కరించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. అలాగే బాధితుల ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని పోలీసు అధికారులకు సూచించారు.

## మాజీ చైర్మన్ దాదాజీని పరామర్శించిన కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



**ఆసిఫాబాద్ జూన్ 15 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల మాజీ సింగిల్ విండో చైర్మన్ ముండోకర్ దాదాజీ ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి పడటంతో ఫ్రాక్చర్ అయింది. ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్, వాంకిడి ఉప సర్పంచ్ దీపక్ ముండేతో కలిసి సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దాదాజీ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకుని ప్రజాసేవలో తిరిగి చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ విశ్వనాథ్, బోటుపెల్లి జైరాం, ఉప్రే విజయ్, వెంకటేష్ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 21న హైదరాబాద్‌లో ఐసీటీ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

**ఉద్యోగ భద్రత కోసం ఐక్య పోరాటం: సీఐటీయూ**




**ఆసిఫాబాద్, జూన్ 15 ప్రజా జ్యోతి** తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఐసీటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల క్రిష్ణమాచారి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాల చెల్లింపు, సేవల క్రమబద్ధీకరణ, కనీస వేతనం రూ.26,000 అమలు తదితర అంశాలపై సదస్సులో చర్చిస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మధు పిలుపు మేరకు సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టీచర్లకు గత నెల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సీనియర్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, కొత్త నియామకాల పేరుతో పాత ఉద్యోగులను తొలగించవద్దని సూచించారు. సదస్సు విజయవంతం కోసం ఈనెల 17న ఉదయం 10 గంటలకు ఆసిఫాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం కాకపోతే ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కుర్సెంగా జాలిమ్షావ్, కోశాధికారి సోయం తిరుపతి, అడ భీంరావు, పంద్రం జంగు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర నూతన విద్యా విధానంలో భాగంగా తాండూర్ మండలంకి ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఇవ్వాలని కోరిన

**బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నవునూరి సుధీర్ గౌడ్ . .**



**తాండూర్ జూన్ 15 ప్రజాజ్యోతి** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవునూరీ సుదీర్ గౌడ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కి కేంద్ర సమగ్ర శిక్ష నూతన విద్యా విధానంలో భాగంగా మంచిర్యాల జిల్లాకు 72 ప్రీ ప్రైమరీ స్కూల్స్ రావడం జరిగింది అందులో తాండూర్ మండలంకు ఒక్కటి కూడా కేటాయించకపోవడం బాధాకరమని తెలియజేయడం జరిగింది మంచిర్యాల జిల్లాలో తాండూరు మండలం పెద్ద మండలం అయినప్పటికీ అందులో తాండూర్, తంగళ్ళపల్లి, అచ్చలపూర్, రేచిని హై స్కూల్ లలో ప్రతి సంవత్సరం విద్యార్థులు అధిక సంఖ్యలో పాస్ అవుట్ అవుతున్నారు ఇలాంటి మండలంకు కచ్చితంగా ప్రీ ప్రైమరీ స్కూల్స్ కేటాయించాలని కోరడం జరి గింది వెంటనే కలెక్టర్ గారు దీనికి స్పందించి డిఈఓ కి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బిజెపి తాండూర్ మండల ఉపాధ్యక్షులు కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి అద్వాల సతీష్, నాయకులు వరిమ పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పాఠశాల ప్రారంభోత్సవం

**విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసిన 11వ డివిజన్ కార్పొరేటర్ సుద్దమల్ల హరికృష్ణ**



**మంచిర్యాల, జూన్ 15 (ప్రజాజ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 11వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల్లో సోమవారం పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ డివిజన్ కార్పొరేటర్ సుద్దమల్ల హరికృష్ణ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి కార్పొరేటర్ హరికృష్ణను ఘనంగా సన్మానించారు. అనంతరం కార్పొరేటర్ హరికృష్ణ కూడా ప్రధానోపాధ్యాయులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ప్రధానోపాధ్యాయులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిశీలించిన హరికృష్ణ, వాటిని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన కార్పొరేటర్ హరికృష్ణ, విద్యార్థులు విద్యతో పాటు జ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, కష్టపడి చదవడం, మంచి లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

**తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ , ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్**



**జూన్ 15, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాజ్యోతి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని సిర్పూర్ కాగజ్ నగర్ లో ఉన్న సిర్పూర్ పేపర్ మిల్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గుర్తింపు కార్మిక సంఘం వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 27వ రోజుకు చేరుకున్న సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ కార్మికులకు సంఘీభావం ప్రకటించి దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ. శంకర్ మాట్లాడుతూ, సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం వెరిఫికేషన్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కార్మికులు విధి నిర్వహణ లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా యాజమాన్యాలు కార్మి కులను కట్టుబాని సలుగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. అందులో భాగంగానే సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం గుర్తింపు సంఘం ఎన్నికలు జరపకుండా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసి అడ్డుకుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో లేబర్ కోడ్ల అమలుతో కార్మికుల హక్కులపై మరింత దాడి జరిగే ప్రమాదం ఉందని, అందుకే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను యాజమాన్యం అడ్డు కుంటోందని అన్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడి ఎన్నికలు నిర్వ హించే వరకు ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపు నిచ్చారు. సిర్పూర్ పేపర్ మిల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి మున్సిపల్ కార్మికుల పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. త్రివేణి, యూనియన్ నాయకులు సంజీవ్, రమేష్, మల్లేష్, సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ఉపాధ్యక్షులు అంగల శ్రీనివాస్, సహాయ కార్యదర్శి వెంకటేష్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్మన్ భాష నేర్చుకోవడంలో క్రమశిక్షణ, నిరంతర సాధనే విజయానికి మార్గం




మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి



**మంచిర్యాల, 15, జూన్ (ప్రజాజ్యోతి):** విదేశీ భాషలు, ముఖ్యంగా జర్మన్ భాషను నేర్చుకునే విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతర సాధనతో ముందుకు సాగాలని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని రాష్ట్ర కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి సూచించారు. టామ్‌కామ్ కార్యాలయంలో జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు, అధ్యాపకులతో సోమవారం మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జర్మనీలో ఉద్యోగాలు పొందాలనే లక్ష్యంతో ఉన్న యువత కోసం టామ్‌కామ్ జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. భారతదేశంలో నర్సింగ్, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ, జర్మనీలో పనిచేసే వారికి లభించే వేతనాలు మన కరెన్సీ విలువతో పోలిస్తే ఎంతో అధికంగా ఉంటాయని తెలిపారు . "కొత్త భాషను నేర్చుకుని జర్మనీ వంటి దేశాల్లో ఉద్యోగాలు సాధించడం మన యువతకు ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుంది. ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే భాషా నైపుణ్యం ఎంతో అవసరం" అని మంత్రి అన్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా మందమర్రిలో ప్రారంభించిన జర్మన్ భాషా తరగతులకు విశేష స్పందన లభించిందని మంత్రి తెలిపారు. "దాదాపు 200 మంది యువత ఈ కోర్సులో చేరడం తనకు ఆనందాన్ని కలిగించిందని అక్కడి అధ్యాపకుడు కూడా ఎంతో ప్రతిభావంతుడిగా కనిపించారని, యువతలో విదేశీ ఉపాధిపై పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనం" అని అన్నారు. విద్యార్థులు సమర్థవంతంగా భాషను నేర్చుకునేలా వారి హాజరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. విదేశీ ఉపాధి అవకాశాలను పొందడంలో భాషా ప్రావీణ్యమే ప్రధాన అడ్డంకిగా మారుతోందని, దానిని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం కోర్సులో చేరడం సరిపోదని, భాషపై సంపూర్ణ పట్టు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఒక్క తరగతిని కూడా మిస్ కాకుండా క్రమం తప్పకుండా హాజరవుతూ, భాషలో ఉన్నత స్థాయి ప్రావీణ్యాన్ని సాధించాలని కోరారు. "ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో తరగతులకు హాజరై భాషపై పూర్తి పట్టు సాధించాలి. నిరంతర అభ్యాసం ద్వారానే విజయం సాధ్యమవుతుంది" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్న మంత్రి, తాను కూడా నిరంతర సాధన, పట్టుదలతోనే తెలుగు భాషను నేర్చుకున్నానని చెప్పారు. ఏ భాషనైనా నేర్చుకోవాలంటే నిరంతర అభ్యాసం, అంకితభావం, క్రమశిక్షణ ఎంతో అవసరమని వివరించారు. జర్మన్ భాషా శిక్షణ పొందుతున్న విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని, శిక్షణను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించిన మంత్రి, విదేశీ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించడంలో ఇలాంటి భాషా శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, అంతర్జాతీయ స్థాయిలో విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకునేందుకు ఇవి దోహదపడతాయని మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెన్షన్, క్లెయిమ్‌ల సమస్యల పరిష్కారానికి సీఎంపీఎఫ్‌వో హెల్ప్‌లైన్ నంబర్




**మంచిర్యాల, 15, జూన్ (ప్రజాజ్యోతి):** బొగ్గు గనుల భవిష్య నిధి సంస్థ (సీఎంపీఎఫ్‌వో) కమిషనర్ కార్యాలయం, ధన్‌బాద్ పెన్షన్ చెల్లింపులు అందకపోవడం, క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం తదితర ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్‌లైన్ మొబైల్ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సీఎంపీఎఫ్‌వో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, పెన్షన్ రాకపోవడం, క్లెయిమ్‌ల సెటిల్‌మెంట్‌కు సంబంధించిన సమస్యలు, ఇతర ఫిర్యాదులను నమోదు చేసేందుకు 9211053010 మొబైల్ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నంబర్ పూర్తిగా అధికారికమైనదని అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల జీవిత ధ్రువీకరణ పత్రం (లైఫ్ సర్టిఫికేట్) సమర్పించినప్పటికీ పెన్షన్ జమ కాకపోవడంతో ఒక విశ్రాంత అధికారి తరఫున ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన అధికారులు ఫిర్యాదును నమోదు చేశారు. అనంతరం గంట వ్యవధిలోనే సీఎంపీఎఫ్‌వో ధన్‌బాద్ సహాయ కమిషనర్‌తో పాటు గ్రీవెన్స్ అధికారి ఫోన్ చేసి పూర్తి వివరాలు సేకరించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. పెన్షనర్లు, విశ్రాంత ఉద్యోగులు ఈ హెల్ప్‌లైన్ నంబర్‌ను తమ మొబైల్‌లో సేవ్ చేసుకుని అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి సీఎంపీఎఫ్‌వో ప్రవేశపెట్టిన అదనపు వ్యవస్థగా ఈ హెల్ప్‌లైన్ ఉపయోగపడనుందని అన్నారు.

# ప్రతి చిన్నారి పాఠశాలలో ఉండాలి.. పనిలో కాదు

**బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజమంతా భాగస్వామ్యం కావాలి**

**మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి**






**మంచిర్యాల, 15, జూన్ (ప్రజాజ్యోతి):** "ప్రతి చిన్నారి పాఠశాలలో ఉండాలి.. పనిలో కాదు" అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం-2026 సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు . పేదరికం, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక మంది చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్చడం ద్వారా వారి భవిష్యత్తును తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. చిన్నారుల బాల్యాన్ని కాపాడటం, వారికి నాణ్యమైన విద్యను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పిన విషయాన్ని గుర్తు చేసిన మంత్రి, గతంలో బాల కార్మికులుగా ఉన్న పలువురు ప్రస్తుతం మంచి ఉద్యోగాల్లో స్థిరపడటం విద్య శక్తికి నిదర్శనమని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను సామాజిక ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని, దీనికోసం సమాజమంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న మంత్రి, ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించగలమని అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు), నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, విదేశీ ఉద్యోగాలకు అనుగుణంగా భాషా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మంత్రి వివరించారు. చిన్నారులు విద్యను పూర్తిచేసుకుని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందగలరని అన్నారు .బాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న సామాజిక కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను మంత్రి అభినందించారు. బాల కార్మికులను రక్షించి విద్యాబాట పట్టించేందుకు వారు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. బాల కార్మిక వ్యవస్థ లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, మంచి భవిష్యత్తు కల్పించేందుకు అందరూ భాగస్వాములు కావాలని మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

## అక్రమంగా పాతిన జెండాలను తొలగించి,ర్యాలీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.



**జన్నారం,జూన్15(ప్రజాజ్యోతి)** మండలంలోని జన్నారం శివారులో ఉన్న సర్వేనెంబర్ 79,80 లో ఉన్న భూమికి సోయం లక్ష్మణ్,సోయం పారుభాయి కి ఎలాంటి సంబంధం లేదని సిడం వంశానికి చెందిన సిడం రామ్ శ్యామ్,సిడం భీమ్ రావు లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోయం లక్ష్మణ్ సోయం పారు బాయ్ లు ప్రసాద్,వాజిద్,పాషా,మనోజ్,విజయ్ ల మాటలు విని మా వంశస్తులను ఎవరిని సంప్రదించకుండా ఇస్లాంపూర్, ఆసిఫాబాద్,జైనూర్ గ్రామాల నుండి గిరిజనులను తీసుకువచ్చి ర్యాలీ నిర్వహించి,సర్వే నెంబర్ 79,80 లో జెండాలు పాతి ధర్నా చేశారు. సర్వే నెంబర్ 79 ,80 లో ఉన్న భూమికి సోయం లక్ష్మణ్, సోయం పారు భాయ్ లకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ధ్యావరశెట్టి శ్రీధర్,ఉత్తురి ప్రభాకర్ లు జన్నారం శివారులో కొనుగోలు చేసిన భూమికి మాకు ఎలాంటి సంబందం లేదని,వారు 5 సంవత్సరాల క్రితమే కొనుగోలు చేశారని అన్నారు అట్టి భూమిలో అక్రమంగా పాతిన జెండాలను తొలగించే ర్యాలీలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# యువత దేశ సేవలో ముందుండాలి

### అగ్నివీర్‌గా ఎంపికైన కరణ్‌కు ఘన సన్మానం



**కెరమెరి జూన్ 15** ప్రజా జ్యోతి కెరమెరి మండలం బోరిలాల్‌గూడ గ్రామానికి చెందిన రాథోడ్ ఉత్తమ్ కళాబాయి దంపతుల చిన్న కుమారుడు రాథోడ్ కరణ్ భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగానికి ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో కరణ్ ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ దంపతులు తమ బావమరిది అయిన కరణ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. యువత దేశ సేవ పట్ల ఆసక్తి పెంచుకొని సైన్యం వంటి గౌరవప్రదమైన రంగాల్లో రాణించాలని వారు ఆకాంక్షించారు. అగ్నివీర్‌గా ఎంపిక కావడం కరణ్ కృషి, పట్టుదలకు నిదర్శనమని పేర్కొంటూ, ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ పెద్దలు పాల్గొని కరణ్‌ను అభినందించారు.

# వృద్ధులపై శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక వేధింపులతో పాటు నిర్లక్ష్యం, హక్కుల ఉల్లంఘనలు కూడా దుర్వినియోగమే

### మంచిర్యాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చీఫ్, ప్రముఖ న్యాయవాది ఎం.డి. సామ్ ధాని

### సిటిజన్స్ సన్ షైన్ డే కేర్ సెంటర్‌లో ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవం







**మంచిర్యాల, 15, జూన్ (ప్రజాజ్యోతి):** వృద్ధులపై శారీరక, మానసిక ఆర్థిక, లైంగిక వేధింపులతో పాటు నిర్లక్ష్యం, హక్కుల ఉల్లంఘనలు కూడా దుర్వినియోగమే అని మంచిర్యాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చీఫ్, ప్రముఖ న్యాయవాది ఎం.డి. సామ్ ధాని అన్నారు .ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవాన్ని సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల సీనియర్ సిటిజన్స్ సన్ షైన్ డే కేర్ సెంటర్‌లో తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సైండ్ల ముందయ్య అధ్యక్షత వహించగా, మంచిర్యాల జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చీఫ్, ప్రముఖ న్యాయవాది ఎం.డి. సామ్ ధాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి కె.ఎం.ఎస్. రెడ్డి, లీగల్ సర్వీసెస్ అథారిటీ డిప్యూటీ చీఫ్ లీగల్ అథారిటీ శ్రీనివాస్ పటేల్, లీగల్ సర్వీసెస్ అథారిటీ అసిస్టెంట్ లీగల్ అథారిటీ సదయ్య, వైస్ ప్రెసిడెంట్ ఆర్. హనుమంతరావు, కోశాధికారి చెర్పి రామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. ప్రభాకర్‌తో పాటు సన్ షైన్ డే కేర్ సెంటర్ సభ్యులు, వయోవృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.డి. సామ్ ధాని మాట్లాడుతూ, 2002లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం నమ్మకమైన బాంధవ్యాల పరిధిలో ఒకసారి లేదా పునరావృతమయ్యే చర్యల ద్వారా లేదా స్పందించకపోవడం వల్ల వృద్ధులకు హాని, బాధ లేదా మానసిక వేదన కలిగితే దానిని వృద్ధులపై దుర్వినియోగంగా పరిగణిస్తారని వివరించారు. వృద్ధులపై జరిగే దుర్వినియోగంలో శారీరక, మానసిక, ఆర్థిక, లైంగిక వేధింపులతో పాటు నిర్లక్ష్యం చేయడం, వారి హక్కులను ఉల్లంఘించడం వంటి అంశాలు కూడా ఉంటాయని తెలిపారు. మానవ నైతిక విలువలు తగ్గిపోవడం, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగవడం, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం, చిన్న కుటుంబాల ధోరణి పెరగడం వంటి కారణాలు వృద్ధులపై వేధింపులకు దారితీస్తున్నాయని అన్నారు. అలాగే వీలునామా (విల్) రాసే విషయంలో వయోవృద్ధులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యక్తి తన జీవితకాలంలో సంపాదించిన స్థిర, చర ఆస్తులను తనకు ఇష్టమైన కుటుంబ సభ్యులు లేదా ఇతరులకు ఇచ్చే హక్కు ఉందని తెలిపారు. వీలునామా తయారీలో అన్ని చట్టపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఆస్తి బదిలీ చేసిన తర్వాత కుటుంబ సభ్యులు వృద్ధులను నిర్లక్ష్యం చేసినా, వేధించినా ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక చట్టాల ప్రకారం దరఖాస్తు చేసుకుని ఆస్తిని తిరిగి పొందే అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా వృద్ధులకు సంబంధించిన పలు చట్టాలను వాటి ఉపయోగాలను అందరికి అర్థం అయ్యేలా విపులంగా వివరించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సైండ్ల ముందయ్య మాట్లాడుతూ, వృద్ధుల సంక్షేమం కోసం చట్టాలు ఉన్నప్పటికీ వారిపై వేధింపులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు పిల్లలు అండగా నిలవడం ప్రతి కుటుంబ బాధ్యత అని అన్నారు. వృద్ధులపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు అవగాహన పెంపొందించాలని, మానవతా విలువలను ప్రోత్సహించాలని, వృద్ధుల సహాయ కేంద్రాలు, డే కేర్ సెంటర్లు, వృద్ధుల సంఘాలను మరింతగా ఏర్పాటు చేయాలని కోరారు. వృద్ధుల అనుభవాలు, సేవలను సమాజ అభివృద్ధికి వినియోగించుకోవడం ద్వారా కుటుంబ వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. సేవా దృక్పథంతో, మానవీయ కోణంలో వృద్ధులకు సహాయ సహకారాలు అందించే నూతన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు.

# యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత

### ఎకరాకు మూడు బస్తాల యూరియా అందించాలని డిమాండ్




**ఆసిఫాబాద్, జూన్ 15** ప్రజా జ్యోతి రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరత సమస్యపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ రైతులకు ఇబ్బందులు కలిగిస్తోందని ఆరోపించారు. వెంటనే ఆ యాప్‌ను రద్దు చేసి, రైతులకు ఎకరాకు మూడు బస్తాల చొప్పున యూరియాను నేరుగా అందించాలని డిమాండ్ చేశారు.అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నప్పటికీ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం రైతులకు అన్యాయం అని కవిత పేర్కొన్నారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు.రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించిన కవిత, వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యా సంవత్సరం ప్రారంభోత్సవంలో అధికారుల సందర్శన




**జైపూర్ జూన్ 15 ప్రజాజ్యోతి** జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జిల్లా విద్యాధికారి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు, గ్రంథాలయం, క్రీడా గది, డైనింగ్ హాల్, డిజిటల్ తరగతులను పరిశీలించి విద్యార్థులతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాలు, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ ఫయాజుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, డ్రాప్‌అవుట్లు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏల్కటూరి శివ, ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టీయూవీ ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర అధ్యక్షుడిగా మాసాడి శ్రీరాములు..

**తెలంగాణ ఉద్యమకారుల వేదిక**





**తాండూర్ : జూన్ 15 ప్రజాజ్యోతి** తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయూవీ)ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర అధ్యక్షుడిగా తాండూరు చెందిన మలిదశ ఉద్యమకారులు మాసాడి శ్రీరాములు యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బోడ సతీష్ (నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్, వైస్ చైర్మన్ నరాల సత్యనారాయణ, తోడేటి శంకర్ గౌడ్ నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణాలో టీయూవీని బలోపేతం చేసేందుకు నియామకాలు జరుగుతున్నట్లు శ్రీరాములు, సతీష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలకు భరోసా ఇవ్వాలని, ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిజమైన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారి సమస్యల పరిస్కారం కోసం పనిచేస్తామన్నారు. తమకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు రాష్ట్ర నాయకులకు, జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేష్, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి పెద్దపల్లి కిషన్ రావు, తాండూర్ అధ్యక్షుడు నిరంజన్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అర్జున్కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్టీపీపీ మూడో యూనిట్ పనులను వేగవంతం చేయాలి

**డైరెక్టర్ తిరుమలరావు**



**జైపూర్, జూన్ 15: ప్రజా జ్యోతి** సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం తిరుమలరావు సోమవారం జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న 1ఐ800 మెగావాట్ల మూడో యూనిట్ పనులను పరిశీలించారు. ప్లాంట్ నిర్మాణంలో భద్రతా చర్యలు, ట్రాక్ హాపర్ పనులు, కోల్ అన్‌లోడింగ్ విధానాలను సమీక్షించిన ఆయన పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేసి నిర్ణీత గడువులోగా మూడో యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఎస్టీపీపీ పరిసరాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు విషయంపై ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధుల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ సీహెచ్ చిరంజీవి, జీఎం ఎం. మదన్ మోహన్, ఇతర ఉన్నతాధికారులు, బీహెచ్ఈఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 20 ఈత చెట్లు ధ్వంసం గీత కార్మికుల ఆగ్రహం

**సంగం శంకర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**ఆసిఫాబాద్ జూన్ 15 ప్రజా జ్యోతి** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, రెబ్బెన మండలం, గోలేటి గ్రామ శివారు అమీన్‌గూడెం సమీపంలో 20 ఈత చెట్లను ప్రొక్లెయిన్ యంత్రంతో కూల్చి కాల్చివేసిన ఘటనపై గీత కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుడైన సంగం శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోలేటి గౌడ సంఘం అధ్యక్షుడు కొయ్యడ రవి గౌడ్, కేసరి సాయ గౌడ్, కేసరి రమేష్ గౌడ్ శనివారం మాట్లాడుతూ, సంగం శంకర్ (తండ్రి: సంగం బానయ్య) ఈత చెట్లను అక్రమంగా ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈత చెట్లు తమ జీవనాధారమని, వాటిని నాశనం చేయడం వల్ల గీత కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎక్సైజ్, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చెట్లను కూల్చివేసిన ప్రొక్లెయిన్ యంత్రాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గీత వృత్తిని ఆధారంగా జీవిస్తున్న కార్మికుల హక్కులు, జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## ఆటో యూనియన్ అధ్యక్షులు గా పోతురాజు శ్రీనివాస్.



**లక్షెట్టిపేట జూన్ 15 (ప్రజాజ్యోతి)** పట్టణం లోని స్థానిక పాత బస్టాండ్ శ్రీ లోకల్ ఆటో యూనియన్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పోతురాజు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా షేక్ మోయిన్, ఉపాధ్యక్షులు పాలాజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గరిసే సుధాకర్, క్యాషియర్ ఎం డి హైమద్ షా ఖాన్, ప్రచార కార్యదర్శి కోడి సత్యం, జాయింట్ సెక్రెటరీ షబ్బీర్ ఖాన్, ముఖ్య సలహాదారులు ఇజ్జత్ షా ఖాన్, పొన్నం శ్రీనివాస్, నూతికట్ల రాజన్న, గాజుల రమేష్ గౌడ్‌ను ఎన్నుకున్నట్లు ప్రచార కార్యదర్శి కోడి సత్యం తెలిపారు. ఇట్టి కార్యవర్గ సభ్యులందరికీ శ్రీ లోకల్ ఆటో యూనియన్ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ సభ్యులందరికీ యూనియన్ ఉన్న ప్రతి ఒక్కరు వారి సహాయ సహకారాలు అందించవలసిందిగా పలువురు కోరడమైనది.

## ఇద్దరు యువకులు అదృశ్యం..

**పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..**

**ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు..**





**బాసర జూన్ 15 (ప్రజాజ్యోతి)** బాసర గ్రామానికి చెందిన ఆస్టం అఖిల్,పర్వతొల్ల బోజన్న అనే ఇద్దరు యువకులు గత రెండు రోజులుగా కనిపించడం లేదనీ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన యువకులు బాసర రైల్వే స్టేషన్ నుండి దేవగిరి ట్రైన్ ఎక్స్ప్రెస్ లో బయలుదేరిన ఇద్దరు యువకులు కామారెడ్డి జిల్లాలో ఓ ప్రైవేట్ షాపులో పొట్టకూటి కోసం పనిచేద్దామని వెళ్లారు. దీంతో అక్కడ పని దొరకకపోవడంతో తిరుగు ప్రయాణంలో బాసర రైల్వే స్టేషన్ లో ట్రైన్ దిగివలసి ఉండగా మహారాష్ట్ర వైపు ఇద్దరు యువకులు బయలుదేరినట్లు స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వారి ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో తల్లిదండ్రులు మహారాష్ట్రలోని నాందేడ్, పర్భని,జాల్నా తదితర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీలాభ్యం కాలేదు. దీంతో బాసర, మహారాష్ట్రలోని పలు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు ఎవరికైనా ఆచూకీ దొరికినట్లైతే పోలీసులకు సమాచారం ఇవ్వండి అని కుటుంబ సభ్యులు కోరారు.

**మా కొడుకులు ఎక్కడ ఉన్న త్వరలో ఇంటికి రండి..**

ఎంతో కష్టపడి మా బిడ్డలను చదివించామని అయినప్పటికీ ఏదో ఒక పని చేస్తామంటే కాదనక వెళ్లారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితులు దూరపు బంధువులు గత రెండు రోజులుగా సమాచారం తెలుసుకున్న ఫలితం లేకుండా పోయిందని బిక్కుబిక్కుమంటూ కుటుంబ సభ్యులు యువకుల కోసం ఎదురుచూస్తున్నారు.

## మా భూములు మాకు క్రమబద్ధీకరించండి

రెబ్బెనలో 250 కుటుంబాల పోరాటం: బంద్‌తో నిరసన

60 ఏళ్ల బతుకులకు గ్యారంటీ ఇవ్వండి: వ్యాపారుల డిమాండ్



**ఆసిఫాబాద్ జూన్ 15 ప్రజా జ్యోతి** 60 ఏళ్లుగా బతుకుతున్న భూములు క్రమబద్ధీకరించాలని రెబ్బెన చిరు వ్యాపారులు రోడ్డెక్కారు. సోమవారం స్వచ్ఛంద బంద్ పాటించి 250 కుటుంబాలు ఐక్యంగా కలెక్టరేట్‌కు వెళ్లి అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. చిరు వ్యాపార పరిరక్షణ కమిటీ నేత మోడెం సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ, 33 ఏళ్ల క్రితం సబ్ కలెక్టర్ కరికెల్ వలేవన్ ప్లాట్లు ఇచ్చారని, ఇప్పుడు 250 ఫ్యామిలీలు, 1000 మంది ఈ భూమిపైనే ఆధారపడ్డారని చెప్పారు. 2007 జాయింట్ సర్వేలో రైల్వేకు 38.04 ఎకరాలే ఉండగా 45.30 ఎకరాలు ఆక్రమించారని, 7.26 ఎకరాలు ప్రభుత్వ మిగులు భూమి ఉందని తెలిపారు. ఇప్పుడున్న షాపులు ఒక ఎకరం కూడా లేవని, 60 ఏళ్లుగా ఉంటున్న తమ భూములు క్రమబద్ధీకరించాలని కోరారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్ కుమార్, తహసీల్దార్ సూర్యప్రకాశ్ పాజిటివ్‌గా రియాక్ట్ అయ్యారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాగే ఐక్యంగా ఉంటే భూములు దక్కుతాయని అన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యామ్ నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాలకు డ్రా నిర్వహణ





**మంచిర్యాల, 15,జూన్ ( ప్రజా జ్యోతి ):** 2026-27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్ ( బి ఎ ఎస్) పథకం కింద 1వ తరగతి, 5వ తరగతులలో ప్రవేశాల కోసం సోమవారం డ్రా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) పి. చంద్రయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జిల్లాలో 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్) లో 91 సీట్లు, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 92 సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరించారు. 1వ తరగతికి 105 దరఖాస్తులు, 5వ తరగతికి 130 దరఖాస్తులు అందాయి. అందుబాటులో ఉన్న సీట్ల కంటే ఎక్కువ దరఖాస్తులు రావడంతో లాటరీ (డ్రా) విధానంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీ సభ్యుల సమక్షంలో పారదర్శకంగా డ్రా చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీవో కోఆర్డినేటర్ రమ కళ్యాణి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి దుర్గాప్రసాద్, శాఖ సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఐసిటి ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత

పెండింగ్ వేతనాల చెల్లింపు,సేవలకు కర్మబద్ధీకరణ కొరకు

ఐసిటి ఉద్యోగుల యూనియన్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మధు పిలుపు మేరకు:

ఈనెల 21వ తేదీ రోజున హైదరాబాద్ లో జరిగే ఐసిటి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి:

సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల క్రిష్ణమాచారి:



**జూన్ 15, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ వెలిశాల కృష్ణమాచారి ఆధ్వర్యంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న ఐసీటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత పెండింగ్ వేతనాల చెల్లింపు సేవలు కర్మబద్ధీకరణ కొరకు ఐసీటీ ఉద్యోగుల యూనియన్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మధు పిలుపు మేరకు ఈ నెల 21వ తేదీ రోజున హైదరాబాద్ లో జరిగే ఐసిటి ఉద్యోగుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా జాయింట్ సెక్రెటరీ వెరిశాల కృష్ణమాచారి పిలుపునిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఐసిటి ఉద్యోగుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, పెండింగ్ వేతనాల చెల్లింపు, సేవల క్రమబద్ధీకరణ తదితర అంశాలపై చర్చించేందుకు తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల ఐసిటి ఉద్యోగుల యూనియన్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మధు పిలుపు మేరకు ఈ నెల 21వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సు ను జయప్రదం చేయాలని ఐ.సి.టి, ఉద్యోగులను కోరారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఐసిటి ఉద్యోగుల యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని ఈనెల 17 వ తేదీ రోజున ఉదయం 10 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జరిగే సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగు లు అందరూ కలిసి రావా లని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఐసిటి ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టీచర్లు అదేవిధంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ రాష్ట్ర సదస్సుకు అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరవు తున్నారని అన్నారు. ఈ సదస్సును విజయవంతం చేయడానికి ప్రతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్ట్రక్టర్ కంప్యూటర్ టీచర్లకు గత నెల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేని ఫెస్టోలో ఐసిటి ఉద్యోగు లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కోరారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఐటీడీఏ విద్యాశాఖలో పనిచేస్తున్న ఐసిటి ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టీచర్ల ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న సీనియర్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, మిగిలిన వారిని దశలవారీగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. పాత ఉద్యోగులకు అన్యాయం చేస్తూ వారి స్థానంలో కొత్త నియామకాల పేరుతో ఉద్యోగ భద్రతకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం విరమించు కోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సాంకేతిక విద్యను బలోపేతం చేయడానికి కంప్యూటర్ టీచర్లను నియమించా రని, విద్యార్థులకు డిజిటల్ అక్షరాస్యత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నా రని తెలిపారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు రాష్ట్ర సదస్సులో ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, పెండింగ్ సమస్యల పరిష్కారం, సేవల క్రమబద్ధీకరణ, పాత ఉద్యోగులందరినీ యథావిధిగా కొనసా గించడం వంటి అంశాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపట్టాల్సిన పోరాట కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. అవసరమైతే ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు, రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపట్టి ఉద్యోగుల హక్కులను సాధించేందుకు బలమైన పోరాట రూపకల్పన చేస్తామని హెచ్చరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఐసిటి ఇన్‌స్ట్రక్టర్లు, కంప్యూటర్ టీచర్లు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల ఐసిటి ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు కుర్సెంగా జాలిమ్షావ్, కోశాధికారి సోయం తిరుపతి, ఆద భీంరావు, పంద్రం జంగు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను వెంట వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 15 ,( ప్రజాజ్యోతి ).** ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.



ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులను గౌరవించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత

## ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవ సదస్సు



**మంచిర్యాల, జూన్ 15 (ప్రజా జ్యోతి):**ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి కార్పొరేషన్ ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్ కమ్యూనిటీ హాల్‌లో డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వక్తలు వృద్ధులపై జరుగుతున్న శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక దుర్వినియోగాలను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. వృద్ధులు కుటుంబాలకు, సమాజానికి అమూల్యమైన సంపద అని, వారి అనుభవాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ప్రతి సంవత్సరం జూన్ 15న నిర్వహించే ప్రపంచ వృద్ధులపై దుర్వినియోగ అవగాహన దినోత్సవం ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణ, భద్రత, సంక్షేమంపై ప్రజల్లో చైతన్యం కల్పించడం ప్రధాన ఉద్దేశమని వివరించారు. వృద్ధులపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను నివారించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కుటుంబ సభ్యులు సమన్వయంతో ఆచరణాత్మక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. వృద్ధులను గౌరవించడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, వారికి ప్రేమ, ఆదరణ, భద్రత కల్పించే వాతావరణం సమాజంలో నెలకొల్పాలని కోరారు. వృద్ధుల హక్కులను పరిరక్షించేందుకు సమాజం మొత్తం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్, సంఘ సభ్యులు వెంకటేశ్వర్లు, ఇన్నారెడ్డి, యాది రెడ్డి, ముత్యాల గౌడ్, ప్రభాకర్ గౌడ్, కృష్ణమూర్తి, సుప్రభాత్ టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బి. మన్యం, రాజనర్సు, లక్ష్మీనారాయణ, బీరయ్య, కొట్టె మల్లయ్యతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మేదరులను గ్రూప్ ఎ లా చేర్చడం పట్ల

సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన

రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మదిరే సత్యనారాయణ



**ఖానాపూర్ జూన్ 15 (ప్రజాజ్యోతి)** గత కొన్ని ఎళ్ళుగా మేదరుల మహేంద్ర సంఘం పోరాటం మేరకు సంచార జాతుల్లో కలపాలని బీసీ ఎ కుల గ్రూపులో చేర్చాలని కోరడం మేరకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మేదరి మహేంద్ర కులానికి గ్రూప్ ఏ సీరియల్ నెంబర్ 14 కింద అధికారికంగా గుర్తించడం హర్షనీయమని తెలంగాణ రాష్ట్ర మేదరి మహేంద్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మదిరే సత్యనారాయణ ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు తమ పోరాటానికి సహకరించిన నిర్మల్ జిల్లా పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్ బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ తో పాటు బీసీ సంక్షేమ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ మేరకు కేబినెట్ లో ఆమోదం తెలిపి జీవో జారీ చేయడం పట్ల రాష్ట్ర మంత్రివర్గానికి ప్రత్యేక ధన్యవాదాలు మేదరి మహేంద్ర సంఘం తరపున తెలుపుతున్నట్లు సత్యనారాయణ అన్నారు

## పేద మధ్య తరగతి చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చటమే అంగన్వాడీ బడిబాట లక్ష్యం

ఐసిడిఎస్ సూపర్ వైజర్ ప్రసూనాకుమారి




**లక్ష్మణ చాంద, జూన్ 15 (ప్రజా జ్యోతి)** 3 నుండి 6 సంవత్సరాల లోపు వయస్సు గల పేద మధ్యతరగతి చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేర్చటమే అంగన్వాడీ బడిబాట ప్రధాన లక్ష్యం అని ఐసిడిఎస్ సూపర్ వైజర్ ప్రసూనాకుమారి అన్నారు. లక్ష్మణ చాంద మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన అంగన్వాడీ బడిబాట కార్యక్రమంలో అమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యతను స్తానికులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రవేశం పొందిన చిన్నారులకు పాలు,గుడ్లు, బాలమృతం వంటి పౌష్టిక ఆహారం అందించటంతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను అందజేయటం జరుగుతుందన్నారు. ఈ కేంద్రాల లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉండటం వలన చిన్నారులు శారీరక,మానసిక వికాసం పొందుతారని తెలిపారు. కావున ప్రవేటు పాఠశాలలో చేర్పించి డబ్బులు వృధాచేసుకోకూడదని అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించ బడుతున్న ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే మండలంలోని మునిపెల్లి,పార్ పెల్లి,చామన్ పెల్లి,చింతల్ చంద, రాచాపూర్, వడ్యాల్, పొట్టపెల్లి, బాబాపూర్, నర్సాపూర్, వడ్యాల్, కనకాపూర్,పీచర,ధర్మారం తదితర గ్రామాలలో అంగన్వాడీ బడి బాట కార్యక్రమం నిర్వాహించారు. ఈ కార్యక్రమం లో ఆయ గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యధర్శులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు,ఆయాలు,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ను సత్కరించిన జిల్లా ఎస్పీ



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 15 ,( ప్రజాజ్యోతి ).**హోంగార్డ్ ఆర్గనైజేషన్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి నేడు పదవీ విరమణ పొందిన ఇందాల్ సింగ్ హోంగార్డును ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఘనంగా సత్కరించారు. 37 సంవత్సరాలు హోంగార్డ్ ఆర్గనైజేషన్ లో సేవలను అందించి ఈరోజు పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ను జిల్లా ఎస్పీ శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు పదవీ విరమణ పొందిన అనంతరం అశేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. దైనందిన కార్యక్రమాలలో భాగంగా వ్యాయామం,యోగా,ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏ.ఓ యూనస్ అలీ, ఆర్.ఐ రామ్ నిరంజన్ రావ్ పాల్గొన్నారు.

## సోనాలలో ఘనంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు.



**సోనాల, జూన్ 15 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను కొమరం భీం చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విధేయుడు రాష్ట్ర ఆర్థిక మంత్రి గా ఎన్నో విజయాలు సాధిస్తూ అప్పుల తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో గాడిలో పెడుతూ తెలంగాణలో సంక్షేమ పథకాలకు, అన్ని శాఖలకు సమన్వయం చేసుకుంటూ నిధులు విడుదల చేస్తున్న గొప్ప ఆర్థిక మంత్రిగా పేరు తెచ్చుకున్న గొప్ప నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి లోలపు పోశెట్టి, బోథ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనిష్,సోనాల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చౌహాన్ వినోద్ సింగ్, చింతల్ బోరి సర్పంచ్ శ్రీరామ్ ,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మునేశ్వర్ సోమన్న, జుంగల భోజన్న, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృత్ రావు పాటిల్,సీనియర్ నాయకులు బాశెట్టి సుదర్శన్, మద్దెల మహేష్, భీంరావు పాటిల్, చంద్రకాంత్, పరశురాం, బండు పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

# కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

పోలీస్ స్టేషన్ పరిసరాలు లాకప్ రూమ్,రిసెప్షన్,బెల్ ఆఫ్ ఆర్మ్స్ రూమ్, స్టోర్రూమ్, నమోదు చేసిన కేసుల రికార్డులు:

పెండింగ్ కేసుల పురోగతి,హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత పరిశీలన:పోలీస్ అధికారులు, సిబ్బంది,విధినిర్వహణ లో అప్రమత్తంగా ఉండాలి

ఎస్.హెచ్.ఓ, సందీప్ కుమార్,స్టేషన్ సిబ్బంది తో సమావేశమై పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ నీతిక పంత్:




**జూన్ 15, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం అసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని సిర్పూర్ కాగజ్నగర్ మండలం ఉన్న కాగజ్నగర్ రూలర్ పోలీస్ స్టేషన్ ను అకాస్మికంగా సందర్శించి తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నీతిక పంత్ ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, లాకప్ రూమ్, రిసెప్షన్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ రూమ్, స్టోర్ రూమ్, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగా లను పరిశీలించారు. అనంతరం ఎస్హెచ్ఓ సందీప్ కుమార్, స్టేషన్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ లో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని,గ్రామాల్లో చట్టవ్యతిరేక చర్యలు అసాంఘిక కార్యకలా పాలు, అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదే శించారు.స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాద పూర్వ కంగా వ్యవహరించా లని అన్నారు.మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లా అండ్ ఆర్డర్ విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, పికెటింగ్, ప్యాట్రోలింగ్ను కచ్చితంగా కొనసాగించా లని సూచించారు. ప్రజా భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్ట పరమైన కఠిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతికా పంత్ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో కాగజ్ నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్ పాల్గొన్నారు.

## సోనాలలో హెచ్ పి వి టీకాల వాక్సినేషన్



**సోనాల, జూన్ 15 ( ప్రజా జ్యోతి ):**సోనాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరో గ్య కేంద్రంలో సోమవారం రోజున ఉచిత "హ్యూమన్ పాపిల్లోమా వైరస్" (హెచ్ పి వి) వాక్సినేషన్ కార్యక్రమం కొనసాగింది. ఈ టీకాల కార్యక్రమం తొలి విడతలో 14 సంవత్సరాల వయస్సు గల బాలికలను లక్ష్యంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ ధర ప్రవేట్ ఆసుపత్రుల్లో రూ. 3000 నుండి 10000 వేల వరకు ఉందన్నారు. ఈ గార్డసిల్ –4 వ్యాక్సిన్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లింగారెడ్డి, ఏఎన్ఎం కవిత పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో

టాటా మ్యాజిక్ ఏసి వాహనం కొనిచ్చిన సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి ప్రశంసించిన డిఇఓ, అదనపు కలెక్టర్లు





**ఖానాపూర్ జూన్ 15 (ప్రజా జ్యోతి )** ఖానా పూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామపంచా యతీ పరిధిలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థులను చేరవేసేందుకు సొంత ఖర్చులతో ఆ గ్రామ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి టాటా మ్యాజిక్ వాహనాన్ని బహుకరించారు పాత ఎల్లాపూర్ పాఠశాలకు వచ్చే విద్యార్థులు వివిధ పల్లె ప్రాంతాలకు ఈ వాహనాన్ని తోలి విద్యార్థుల్ని పాఠశాలకు చేర్పించడం జరుగుతుందని అన్నారు గతంలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 130ఉంటే ఈ ఏడు 230పైన విద్యార్థులను చేర్పించడం జరిగిందని సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి అన్నారు సర్పంచ్ విద్యార్థులకు చేస్తున్న సేవ పట్ల జిల్లా అదన కలెక్టర్ వెంకటేశ్వర్లు డిఇఓ భోజన్న లు ప్రశంసించారు ఉదయం పాఠశాలలకు చేర్చిన విద్యార్థులకు టిఫిన్ కూడా అందజేస్తున్నట్లు తెలిపారు సోమవారం రెండు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం తరఫున పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సర్పంచ్ చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు పాత ఎల్లాపూర్ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోవడం పట్ల పంచాయతీ ప్రజలతో పాటు ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు పేద కుటుంబాలకు ఇన్సూరెన్స్ కార్డులు, ఉచిత వైద్యంతో పాటు మందుల పంపిణీ గ్రామంలో భారీ ఎత్తున అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సొంత ఖర్చులతో ఏర్పాటుచేసిన సాహస నిర్ణయాల పట్లనిర్మల్ జిల్లాలోని సర్పంచ్ పాలకవర్గాల్లో ప్రేరణ కల్పిస్తుంది ఏది ఏమైనా ప్రశాంత్ రెడ్డి ప్రజా సేవలు అభినందనీయమని పలువురు వ్యాఖ్య నిస్తున్నారు

## జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా






**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 15 ,( ప్రజాజ్యోతి ).**జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం అంశంపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యానికి మించి ఉద్యానవన పంటలను రైతులు సాగు చేసేలా అధికారులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం వల్ల రైతులు లాభాలు పొందగలుగుతారని వివరించారు. ప్రస్తుతం విపణిలో ఉద్యానవన పంటలకు డిమాండ్ ఉన్నదని, దీనికి అనుగుణంగా రైతులు ఉద్యానవన పంటల సాగు వైపు మల్లాలని సూచించారు. తక్కువ శ్రమ, తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక లాభాలు కలుగుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తదనుగుణంగా రైతులకు క్షేత్రస్థాయిలో ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన పంటల అధికారి రమణ, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 15 ,( ప్రజాజ్యోతి ).**గ్రామీణ ప్రజలందరికీ ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్, కుబీర్ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడుతూ, రోజువారీగా ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి సంబంధించి న అన్ని రకాల రిజిస్టర్లు, రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. పరిసరాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రభుత్వ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. హాజరైన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నూతన ఏకరూప దుస్తులను అందించారు. ప్రభుత్వం, విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా సౌకర్యాలు కల్పిస్తుందని, వీటన్నింటినీ వినియోగించుకొని విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని తెలిపారు. వసతి గృహ ప్రహరీ గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ శ్రీదేవి ఎంపీడీవో భీమేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

## గ్రీవెన్స్ డే ద్వారా ప్రజా సమస్యలకు పారదర్శకంగా తక్షణ పరిష్కారం

## జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూన్ 15 ,( ప్రజాజ్యోతి ).**నిర్మల్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించి వెంటనే పిర్యాదు దారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా అందాల్సిన సహాయాన్ని అందిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతు ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వ కంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు.తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను మా దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి, ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పారదర్శక విధానంలో చర్యలు తీసుకోవడమే మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు.

# యోగ దినోత్సవ సందర్భంగా పల్లె పల్లెన యోగ వేడుకలు



**సోనాల, జూన్ 15 ( ప్రజాజ్యోతి ):**అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆయుష్ విభాగ్ ఆధ్వర్యంలో సోనాల మండల కేంద్రంలో సోమవారం ఉదయం గ్రామ పురవీధుల్లో యోగా శిక్షకురాలు మునిగెల యోగిత ఆధ్వర్యంలో యోగా వాక్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా యోగ వలన కలిగే ప్రయోజనాలు, యోగ చేయడం వల్ల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉంటారు అని అలాగే ఉరుకుల పరుగుల జీవితంలో యోగ నిత్యం తప్పనిసరి అని గ్రామస్థులు తెలిపారు.యోగ వాక్ వల్ల గ్రామ ప్రజలకి అవగాహన కలుగుతుంది అని అన్నారు.యోగా ఆసనాలు వేయడం వల్ల వ్యక్తి నియంత్రణలో ఉంటారు అలాగే గర్భిణీలకు సాధారణ ప్రసవం జరిగేలా కూడా ఉపయోగ పడుతుందని అన్నారు.ప్రతి రోజు ఉదయం ,సాయంత్రం 6గంటలకి ఆయుష్ విభాగం లో యోగ ప్రత్యేకంగా మహిళలకు ,వృద్ధులకు, గర్భిణులకు నేర్పించబడుతుంది అని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి ప్రీతల్ రాథోడ్ తెలిపారు.ప్రీతల్ రాథోడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 సందర్భంగా జూన్ 12 నుండి 21 తేదీ వరకు ప్రణాళిక కార్యక్రమాలు ఉన్నాయి అని అందులో భాగంగా సోమవారం యోగా వాక్ ,16 తేదీ మంగళవారం అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకి యోగా,ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి అవగాహన ఉంటుది అని ఇందులో ఆశ వర్కర్లు,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొనాలి అని.17 తేదీన బుధవారం గ్రామ ఆరోగ్య పారిశుధ్య ఆరోగ్య కమిటీ పోషకాహార కమిటీ భాగస్వామ్యంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ 2026 థీమ్ అయినటువంటి ప్రతి ఒక్కరికి యోగా అని ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని ,అలాగే గ్రామంలో వివిధ రాజకీయ నాయకులకు యోగా పైన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలి అని.వివిధ రంగాల్లోనీ క్రీడాకారులను మరియు వివిధ రంగంలోని వారి ద్వారా యోగా పైన ప్రసంగాల వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం,ప్రాణాయామం, భావోద్వేగాలు వంటి వాటిని నియంత్రించడం ఎలా ఏకాగ్రత వంటి వాటి పైన ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి అని అలాగే జూన్ 21 యోగా దినోత్సవం సందర్భంగా యోగ సంగమం కూడా ఉంటుందని ఈ కార్యక్రమాలలో భారీ ఎత్తున ప్రతి ఒక్కరు పాల్గొనాలి విజయవంతం చేయగలరు అని తెలిపారు..ఈ యోగా వాక్ లో విద్యార్థులు, గ్రామ ప్రజలు ,గ్రామ పెద్దలు, మహిళలు,గ్రామ యువత, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సోనాల బాలుర వసతి గృహాన్ని సందర్శించిన దళిత సంఘాల నాయకులు



**సోనాల, జూన్ 15 ( ప్రజాజ్యోతి ):**సోనాల మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోనాల అంబేద్కర్ సంఘం నాయకులు ఈ విద్యా సంవత్సరం సందర్భంగా సోమవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు హాస్టల్ ప్రాంగణం అంతా తిరిగి విద్యార్థుల గదులు మరుగుదొడ్లు వంటగదిని తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల కు ప్రతిరోజు అందుతున్న మెనూ తాగునీటి, విద్యా సౌకర్యాలు గురించి వార్డెన్ విజయ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమృత్ రావు పాటిల్, కత్తి గంగాధర్ పాల్గొన్నారు.

## జ్ఞాన వికాస్ పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**నేరడిగొండ, జూన్ 15 ( ప్రజాజ్యోతి ):** నేరడిగొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జ్ఞాన వికాస్' ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యే వెంట మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నా యకులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరల్డ్ విజన్ ఆధ్వర్యంలో కార్పెట్ల పంపిణీ




**లక్ష్మణ చాంద, జూన్ 15 (ప్రజా జ్యోతి)** వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సోమవారం రోజున కార్పెట్లను పంపిణీ చేశారు. మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఒక 103 మంది విద్యార్థులకు కార్పెట్లను పంచగా మునిపల్లిలో 103 మంది పేద విద్యార్థులకు సుమారు 50,000 రూపాయల విలువ గల కార్పెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజర్ బ్రహ్మన్న మాట్లాడుతూ వరల్డ్ విజన్ సంస్థ ద్వారా చిన్నారులకు సంవత్సరానికి ఒకసారి బహుమతిగా పలు వస్తువులను అందిస్తు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముని పెల్లి గ్రామ సర్పంచ్ మేడిపల్లి సునీత గంగాధర్ గ్రామ ఉప సర్పంచ్ రంజిత్ రెడ్డి, కార్యదర్శి అశ్విత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ లు సుజాత, ఇందిర పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య



ఇచ్చోడ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ హెడ్ మాస్టర్ గారికి ఇవ్వడం జరిగిందిమధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని



పట్వార్ కూడా.. ప్రైమరీ స్కూల్.ఇచ్చోడ మండల్..హెడ్ మాస్టర్ గారికి ఇవ్వడం జరిగింది

**ఇచ్చోడ, జూన్ 15, (ప్రజా జ్యోతి)**మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్క రించాలని ఏఐటియుసి ఇ చ్చోడ మండల ప్రధాన కార్య దర్శి కల్లెపల్లి గంగయ్య డి మాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజున సోమవారం వివిధ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు  మధ్యాహ్నం భోజన కార్మికులతో కలిసి వినతి పత్రాలు సమర్పించారు.తెలంగాణ ఏఐటీయూసీ. అనుబంధ సంఘంమధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూ నియన్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం అదిలా బాద్ జిల్లా ఇచ్చోడ మండలం లోని జెడ్ పి ఎస్ ఎస్, యు పి ఎస్ స్కూల్లో ఇచ్చోడ మండలంలోని పట్వారిగూడా ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యా యులకు ఇచ్చోడ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి పెందుర్ సింధు, పంచ పూల, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కా ర్మికులు కొత్తూరు సంజు, అన్నెల నరసమ్మ, మచ్చ మమత, ములుగు లక్ష్మి, మచ్చ సునీత చంచల బాయ్, కార్మికులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐ టియుసి మండల ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య మా ట్లాడుతూ ఆయా గ్రామాల ప్రైమరీ స్కూల్ యుపిఎస్సి స్కూల్‌లో హెడ్ మాస్టర్‌లు మధ్యాహ్న భోజన కార్మికులకు సహకరించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో కాలం భిన్న తీస్తున్న మధ్యాహ్న కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయా లని వేతనాలు క్రమం తప్ప కుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నిక ల్లో ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం గెలవగానే 10,000 రూపాయలు వేతనం ఇస్తామని చెప్పడం జరిగిందని, ఆ హామీ వెంటనే అమలు చేయాలని, కనీస వేతనాలు 26 వేల రూపాయలు, కోడిగుడ్లు వంట సామాన్లు నూనెలు ప్రభుత్వమే బాధ్యత తీసుకొని ఇప్పించాలని కోరారు.ప్రతి విద్యార్థికి మెస్ ఛార్జీలు రూ 25 చెల్లించాలని, ఈ ఎస్ ఐ సౌకర్యం తో పాటు ఐడెంటి కార్డులు ఇప్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇ ప్పించాలని కార్మికుల సమ స్యలు పరిష్కరించాలని ఏఐ టీయూసీ మండల ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి గంగయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతా మని హెచ్చరించారు.

# ఆదిలాబాద్ ప్రభుత్వ పాఠశాలలకు 'నిర్ణయ్' సంస్థ ఆధ్వర్యంలో డెస్క్ బెంచీల వితరణ





### ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ కలెక్టర్ రాజేశ్వర్

**ఆదిలాబాద్ టౌన్, జూన్ 15 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణం లోని పిట్టలవాడలో తెలుగు, ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల వస తులకై 'నిర్ణయ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డ్యూయల్ డెస్క్ బెంచీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజే శ్వర్ ముఖ్య అతిథిగా విచ్చే సి, పాఠశాలలకు బెంచీలను పంపిణీ చేశారు. ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల బ లోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, దానికి తోడు స్వచ్ఛంద సంస్థలు సైతం తమ వంతుగా చేయూత నివ్వడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అ న్ని సదుపాయాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లి దండ్రులు తమ పిల్లలను చదివించాలని  ఈ సందర్భంగా కోరారు. అనంతరం 'నిర్ణయ్' సంస్థ డైరెక్టర్ నిఖిని వర్మ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు అందాలనే ఉద్దేశంతో ఈ కా ర్యక్రమం చేపట్టామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వార్డు కౌన్సిలర్‌ల అభ్యర్థన మేరకు, ఎన్ఆర్ఐల ఆర్థిక అనుసంధానంతో ఈ డెస్క్ బెంచీలను సమకూర్చినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్ర భుత్వ పాఠశాలల్లోని అవస రాలను గుర్తించి, మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహి స్తామని ఆమె హామీ ఇచ్చారు.ఈ వితరణ కార్యక్రమంలో మండల విద్యాధికారి సోమయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం అను రాధ, వార్డు కౌన్సిలర్ షాలిని యోగేష్ మిట్టాపురే, తెలుగు, ఉర్దూ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి త ల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టానికి సభ్యత్వ నమోదు ముఖ్య కార్యక్రమం

ఖానాపూర్ నియోజకవర్గ

బి ఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ సుమిత్ర తనోబా



**ఖానాపూర్ జూన్ 15 (ప్రజాజ్యోతి )** టిఆర్ఎస్ పార్టీ పాకిస్తాన్ కి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముఖ్యమైనదని ఖానాపూర్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ సుమిత్ర తనోబా అన్నారు సోమవారం అసెంబ్లీ ఇంచార్జ్ జాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దశ దిశ నిర్దేశించారు బూతు స్థాయి నుండి గ్రామ పట్టణ మండల స్థాయిలో పార్టీ సభ్యత్వానికి కార్యకర్తలు కంకణం కట్టు పోవాలన్నారు ఈ సమావేశంలో అసెంబ్లీ ఇన్చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ సోయా హుస్సేన్ రెండో వార్డ్ కౌన్సిలర్ మండల పార్టీ అధ్యక్షులుతాళ్లపల్లి రాజా గంగన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సక్కరం శ్రీనివాస్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాజీ మండల ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ వాల్ సింగ్ ఉప్పల గజేందర్ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు నసీర్  పార్టీ నాయకులు బూతు ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు కార్యక్రమం అనంతరం అసెంబ్లీ ఇన్చార్జ్ జనసేన నాయక్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ సుమిత్ర తనోభను కార్యకర్తలు సన్మానించారు

# నేడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘనంగా జన్మదిన వేడుకలు


నియోజకవర్గంలో అన్నదానాలు, పండ్ల పంపిణీ పలు సామాజిక కార్యక్రమాలు



**ఖానాపూర్ జూన్ 15 (ప్రజాజ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు ఆదివాసి పోరు బిడ్డ నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎడమ బొజ్జపటేల్ జన్మదిన వేడుకలు నియోజకవర్గం లోని పలు మండలాల్లో ఘనంగా నేడు మంగళవారం నిర్వహించి నట్లు పార్టీ వర్గాలు ప్రకటనలో తెలిపాయి ఈ మేరకు ఖానాపూర్ మండలంలో  ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ అనంతరం బాధన్ కుర్తి గ్రామ పొలిమేరలో ఎమ్మెల్యే కి స్వాగతం పలికిన అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి  అనంతరం ఖానాపూర్ మస్కాపూర్ ప్రాంతంలో గల  సీఎం రావు ఫంక్షన్ హాల్ లో  జన్మదిన సందర్భంగా జరిగే అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటారని ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ అధ్యక్షులు జంగిలి శంకర్ గొర్రె గంగాధర్లు ఒక ప్రకటనలో తెలిపారు అనంతరం ఖానాపూర్ పట్టణంలోనిఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మున్సిపాలిటీ పరిధిలో సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటారని ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలని కోరారు

## బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు

**హలో యువత.. చలో సిసిఐ పరిశ్రమ !**



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 15,( ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ నిరుద్యోగ యువతీ యువకులారా, సీసీఐ పరిశ్రమ ఏర్పాటు దిశగా సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వ హించనున్న "హలో యువత.. చలో సీసీఐ పరిశ్రమ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. సీసీఐ పరి శ్రమ పునఃప్రారంభం ద్వారా స్థానిక యువత కు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిలాబాద్ సిమెంట్ పరిశ్రమను కూల్చివేసే చర్యలకు పాల్పడటం వల్ల యువత భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఆర్ అండ్ బి గెస్ట్ హౌ స్ నుండి సిమెంట్ ఫ్యాక్టరీ వరకు సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న కీలక పరిశ్రమ అంతరించిపోతుందనే పరిస్థితిని ప్రతి ఒక్కరూ ప్రతి ఘటించాలని పిలుపునిచ్చారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో , జూన్ 15, (ప్రజా జ్యోతి)**ఈ నెల 21న నిర్వహించను న్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షను జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదే శించారు. సోమవారం కలెక్టరే ట్ సమావేశ మందిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. నీట్ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుతో కూడుకున్నదని, ఏ చిన్న పొరపాటుకు తావులే కుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచే యాలని ఆదేశించారు.పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక ఆదే శాలు జారీ చేశారు. కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, తగినంత వెలుతురు, ఫర్నిచర్ ఉండేలా విద్యా శాఖ అధికారులు పర్యవేక్షిం చాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని, ఏ ఎన్ ఎంలతో పాటు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల ని ఆరోగ్య శాఖను ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో కేం ద్రాలకు చేరుకునేలా అదనపు ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. ఎస్పీ మాట్లాడు తూ పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, క్రమశిక్షణ విషయంలో రా జీ పడకూడదని స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆల స్యమైనా అభ్యర్థులను లోపలికి అనుమతించే ప్రసక్తి లేద ని, విద్యార్థులు ఈ 'నిమిషం నిబంధనను' గమనించి అప్ర మత్తంగా ఉండాలని సూచిం చారు. ఈ సమావేశంలో అద నపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, ఏవో వర్మ, విద్యా, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకం





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 15, (ప్రజా జ్యోతి)** సమాజ నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీ లకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారంగా దిగూడ మండలంలోని లోకా రి (కె) గ్రామంలో నూతనంగా నిర్మించిన "మండల ప్రాథమిక పాఠశాల" నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ఆసిఫాబాద్ శాస నసభ్యురాలు కోవా లక్ష్మి తో కలిసి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై, పాఠశాల భవనాన్ని ప్రారంభించి, పాఠ్యపు స్తకాలను విద్యార్థులకు అందజేశారు. అంతకు ముందు అతిథులు కొమురం భీం విగ్రహాని కి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అన్ని వసతులతో కూడిన నూతన పాఠశాల భవనాలను నిర్మి స్తోందని తెలిపారు. "ప్రభుత్వ బడులలో చదువుదాం – మీ పిల్లల జీవితానికి వెలుగులు నింపుదాం" అనే నినాదాన్ని తల్లిదండ్రులంతా నిజం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవ జ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా చక్కని విద్యా బోధన అందుతుందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ డిజిటల్ మౌలిక వసతులు కల్పిస్తున్నా మని స్పష్టం చేశారు. గ్రామస్తులు, పాఠశాల యాజమాన్య కమిటీ సమన్వయంతో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని సూచించారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ లోకారి (కె) గ్రామంలో నూతన పాఠశాల భవనం ప్రారంభం కావడం శుభపరిణామమని హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యారంగం రూపు రేఖలను మారుస్తున్నామని, విద్యార్థులు ఈ వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లి దండ్రులెవరూ తమ పిల్లలను చదువుకు దూరం చేయవద్దని, బడి వయసు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడు తూ నియోజకవర్గ పరిధిలోని మరి న్ని పాఠశాలల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో నూతన రోడ్డు నిర్మాణ పనులకు కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే కలిసి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, స్థానిక సర్పంచ్ మండవి పుష్పలత జాకు, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ స్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న నకిలీ పత్తి విత్తనాల విక్రేతలపై ఉక్కుపాదం

**రెండు కేసుల్లో ఇద్దరు నిందితు ల అరెస్ట్**

**58 నకిలీ పత్తి విత్తనాల ప్యా కెట్లు స్వాధీనం**

**ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ కె నరేష్ కుమార్**



**ఇచ్చోడ, జూన్ 15, (ప్రజా జ్యోతి)** రైతులను మోసం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను విక్ర యిస్తు న్న వారిపై ఇచ్చోడ పోలీసు లు, వ్యవసాయ, రెవెన్యూ శా ఖల సంయుక్త టాస్క్‌ఫోర్స్ బృందంతో కలిసి నిర్వహించి న ప్రత్యేక తనిఖీల్లో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, 58 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్ల ను స్వాధీనం చేసుకున్నట్లు ఇ చ్చోడ ఎస్‌హెచ్‌వో కె. నరేష్ కుమార్ తెలిపారు. గత 14 న ధాబా(బి) గ్రామానికి చెందిన ఎ1 సర్పాటే ఈశ్వర్ వద్ద తని ఖీలు నిర్వహించగా 34 పింక్ బాండ్ (5జి) నకిలీ పత్తి విత్త నాల ప్యాకెట్లు స్వాధీనం చే సుకున్నారు. విచారణలో ఈ విత్తనాలను ఎ2 పాపిన్‌వార్ సునీల్ కుమార్, ఆదిలాబాద్ వద్ద నుంచి కొనుగోలు చేసి వి క్రయిస్తున్నట్లు వెల్లడించాడు. అలాగే ఇప్పటికే సుమారు 300 ప్యాకెట్లను ఎ3 విజయ్ కు విక్రయించినట్లు తెలిపా డు. 15 న సాయినగర్, ఇచ్చోడ కు చెందిన ఎ1 రాథోడ్ గణేష్ వద్ద తనిఖీలు నిర్వ హించగా 24 పింక్ బాండ్ (5జి) నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఈ విత్త నాలను ఎ2 పాపిన్‌వార్ సు నీల్ కుమార్, ఆదిలాబాద్ వ ద్ద నుంచి కొనుగోలు చేసి రైతు లకు విక్రయిస్తున్నట్లు అంగీక రించాడు. అలాగే ఇప్పటికే సుమారు 100 ప్యాకెట్లను వివిధ వ్యక్తులకు విక్రయించిన ట్లు వెల్లడించాడు.

**అరెస్ట్ అయిన నిందితులు**

సర్పాటే ఈశ్వర్, ధాబా(బి) గ్రామం, ఇచ్చోడ మండలం. రాథోడ్ గణేష్, సాయినగర్, ఇచ్చోడ లను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు నరేష్ కుమార్ వివరించారు.

ఎ 2 పాపిన్‌వార్ సునీల్ కు మార్, ఆదిలాబాద్. (ప్రస్తుతం మరో కేసులో అరెస్టై రిమాండ్ లో ఉన్నాడు.) ఎ 3 నిందితు డు విజయ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. రెండు కేసుల్లో స్వా ధీనం చేసుకున్న విత్తనాల ప్యాకెట్లపై తప్పనిసరిగా ఉం డాల్సిన టెస్టింగ్ తేదీ, ప్యాకిం గ్ తేదీ, లాట్ నంబర్, గడువు తేదీ వంటి వివరాలు లేకపోవ డంతో అవి నకిలీ విత్తనాలు గా నిర్ధారించబడ్డాయి.రెండు కేసుల్లో అరెస్టు చేసిన నింది తులను రిమాండ్‌కు తర లించగా, ప్రధాన సరఫరాదా రుగా గుర్తించిన పాపిన్‌వార్ సునీల్ కుమార్ ప్రస్తుతం మ రో కేసులో రిమాండ్‌లో ఉన్నా డు. పరారీలో ఉన్న హట్కరే విజయ్ కోసం గాలింపు చర్య లు కొనసాగుతున్నాయని అన్నారు. రైతులు నకిలీ వి త్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలపై వెంటనే పోలీసులకు లేదా వ్యవసా య శాఖ అధికారులకు సమా చారం అందించాలని ఇచ్చోడ ఎస్‌హెచ్‌వో కె. నరేష్ కుమార్ సూచించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 15, (ప్రజా జ్యోతి)** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రమాదాల నివారణ, ప్ర యాణికుల భద్రతపై స్పష్ట మైన దిశానిర్దేశం చేశారు.

**ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 'బ్లాక్ స్పాట్స్'ను గుర్తించి, అక్కడ తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రహదారుల పక్కన ఉన్న ఆక్రమణలను తొలగించడం, గుంతలు పడిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆ దేశించారు. రహదారుల వెంబడి ప్రమాద సూచికలు (సైన్ బోర్డులు), స్పీడ్ బ్రేకర్లు, రేడి యం లైట్లు, బ్లింకర్లను ఏర్పాటు చేసి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని స్పష్టం చేశారు. పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో నిరంతరం వాహన తనిఖీలు చేపట్టాలని, నిబంధనలు పాటించని వారికి భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. కేవలం జరిమానాలకే పరిమితం కాకుం డా, విద్యార్థులకు, సామాన్య ప్రజలకు రోడ్డు భద్రతపై అవ గాహన సదస్సులు నిర్వహించాల్సిన బాధ్యత అధికారుల పై ఉందని పేర్కొన్నారు. ప్రాణ రక్షణ కంటే ఏదీ ముఖ్యం కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండాలని సూచించారు.

**నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు**

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం వంటి నిర్లక్ష్యపు చర్యల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశా రు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్. ఎ స్. చిత్రు, ఉట్నూర్ ఆర్డీఓ మోహన్ సింగ్, ఆర్ అండ్ బి ఈ ఈ నర్సయ్య, జాతీయ రహదారుల సంస్థ (ఎన్ ఎచ్ ఏ ఐ), రవాణా శాఖ (ఆర్ టి ఎ), మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 10 శాతం వడ్డీ తో రూ.70 వే ల అప్పుకు రూ.1. 33 లక్షలు వసూలు

అయినా వేధింపులే

ఆటో అపహరణ కేసులో ము గ్గురు నిందితుల అరెస్ట్, రి మాండ్

వన్ టౌన్ సిఐ బి సునీల్ కు మార్





**ఆదిలాబాద్ టౌన్, జూన్ 15 (ప్రజా జ్యోతి)** అధిక వడ్డీ పేరుతో బాధితుడి ని వేధిస్తూ, అతని ఆటోను బ లవంతంగా అపహరించిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బి. సునీల్ కుమార్ తెలిపారు.

ఖానాపూర్‌కు చెందిన తాహేర్ అలీ అనే ఆటో డ్రైవర్ తన అవసరాల నిమిత్తం పిట్టలవా డకు చెందిన ఎ1 పండిగొట్టి కొండయ్య, అతని భార్య ఎ2 పండిగొట్టి లక్ష్మి ఏ పాండికోటే వద్ద రూ.70,000 లను 10% వడ్డీతో అప్పు తీసుకున్నాడు. అప్పు తీసుకున్న అనంతరం నెలవారీ వడ్డీ చెల్లిస్తూ ఇప్పటి వరకు సుమారు రూ.1,33,00 0 చెల్లించినప్పటికీ నిందితు లు మరింత డబ్బు కోసం వే ధింపులకు పాల్పడుతూ వ చ్చారు.ఈ క్రమంలో గత 14 న ఠాకూర్ హోటల్ సమీపం లో ఆటోలో ఉన్న బాధితుడి వద్దకు ఎ1 పండిగొట్టి కొండ య్య, ఎ2 పండిగొట్టి లక్ష్మి ఏ పాండికోటే, ఎ3 సిండే మురళి ఏ మాధవ్ వెళ్లి అతని జేబు లో నుంచి ఆటో తాళాలు బ లవంతంగా లాక్కొని ఆటో నంబర్ టీఎస్01-ఖజ-7996 ను తీసుకెళ్లారు. బాధితుడి ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీ సులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎ దుట హాజరుపరచగా రిమాం డ్ విధించారు.

**అరెస్ట్ అయిన నిందితులు**

ఎ1 పండిగొట్టి కొండయ్య, పిట్టలవాడ, ఆదిలాబాద్.



ఎ 2 పండిగొట్టి లక్ష్మి ఏ పాం డికోటే, పిట్టలవాడ, ఆదిలా బాద్.ఎ 3 సిండే మురళి ఏ మాధవ్, పిట్టలవాడ, ఆది లాబాద్ లను అరెస్ట్ చేసి రి మాండ్ తరలించినట్లు చెప్పా రు. అనుమతి లేకుండా అధిక వడ్డీలు వసూలు చేస్తూ ప్రజల ను వేధించే వారిపై కఠిన చర్య లు తీసుకుంటామని, ఇలాం టి ఘటనలపై వెంటనే పోలీ సులను ఆశ్రయించాలని వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో బి. సునీల్ కుమార్ సూచించారు.

# నిబంధనలకు విరుద్ధంగా పో లీస్ సైరన్ వినియోగం - కారు సీజ్

ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన వాహనదారుడిపై కేసు నమోదు

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన

వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ బి. సునీ ల్ కుమార్




**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 15, (ప్రజా జ్యోతి)** సోమవారం మధ్యాహ్నం సు మారు 3.00 గంటల సమ యంలో ఆదిలాబాద్ పట్టణం లోని మల్టీపర్పస్ గ్రౌండ్ సమీ పంలో టీఎస్ 01 జూ 5555 నం బర్ గల కారును తనిఖీ చేయ గా, సదరు వాహనంలో నిబం ధనలకు విరుద్ధంగా పోలీస్ సై రన్ హారన్‌ను అమర్చుకుని వినియోగిస్తున్నట్లు గుర్తించిన ట్లు వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ బి. సు నీల్ కుమార్ తెలిపారు.సదరు వాహనదారుడు అనధికారి కంగా పోలీస్ సైరన్‌ను ఉప యోగిస్తూ ఇతర వాహనదారు లు, ప్రజలను భయభ్రాంతుల కు గురిచేయడంతో పాటు ట్రా ఫిక్ నిబంధనలను ఉల్లంఘిం చినట్లు గుర్తించి, అతనిపై కే సు నమోదు చేసినట్లు తెలిపా రు.నిబంధనలకు విరుద్ధంగా పోలీస్ సైరన్ వినియోగిస్తున్న టీఎస్ 01 జూ 5555 నంబర్ గల కారును పోలీసులు స్వాధీనం (సీజ్) చేసుకున్నట్లు తెలిపా రు. పోలీస్, అత్యవసర సేవ లు లేదా ప్రభుత్వ అనుమతి ఉన్న వాహనాలు మినహా ఇ తర వాహనాలపై సైరన్లు, ప్ర త్యేక హారన్లు, వినియోగించ డం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై క ఠిన చట్టపరమైన చర్యలు తీ సుకుంటామని వన్‌టౌన్ ఇ న్స్పెక్టర్ బి. సునీల్ కుమార్ హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రథమ కర్తవ్యం

ప్రజా ఫిర్యాదుల విభాగంలో 58 ఫిర్యాదుల స్వీకరణ

సోమవారం ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ బ్యూరో, జూన్ 15, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్ర మాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ ఐపీఎస్ నిర్వహించా రు. జిల్లాలోని వివిధ ప్రాంతా ల నుంచి వచ్చిన ప్రజలు త మ సమస్యలు, ఫిర్యాదులను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువ చ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నేరుగా జిల్లా నలుమూ లల నుండి వచ్చిన మొత్తం 58 ఫిర్యాదులను నేరుగా స్వీకరించి సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా సమస్యల పరిష్కారానికి ఆ దేశాలు ఇచ్చారు. బాధితుల కు న్యాయం జరిగేలా సమస్య లను త్వరితగతిన పరిష్కరిం చాలని తెలిపారు. ప్రజలు పో లీసు శాఖపై ఉంచిన నమ్మకా న్ని నిలబెట్టుకుంటూ, ప్రతి ఫి ర్యాదుపై చట్టపరమైన చర్య లు తీసుకొని బాధితులకు న్యాయం అందించేందుకు జి ల్లా పోలీసు యంత్రాంగం కట్టు బడి ఉందని జిల్లా ఎస్పీ తెలి పారు. అసాంఘిక కార్యకలా పాలపై ఎలాంటి సమాచారం ఉన్న వాట్సాప్ ద్వారా మెసేజ్ రూపంలో 8712659973, నెంబర్ కు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబ డతాయని తెలిపారు. ఈ కా ర్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధి కారి జైస్వాల్ కవిత, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల నయా దందా

మామడ జూన్ 17 (ప్రజా జ్యోతి)

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా మండలాల్లో ప్రైవేట్ విద్యా సంస్థల సంఖ్య ఏటా పెరుగుతోంది. నాణ్యమైన విద్య పేరుతో కొత్త కొత్త పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐఐటీ-నీట్ అకాడమీలు పుట్టుకొస్తున్నాయి. అయితే వీటిలో కొన్ని సంస్థలు విద్యా ప్రమాణాలు, భద్రతా నిబంధనలు, మౌలిక వసతులను పక్కనబెట్టి కేవలం వ్యాపార ధోరణితో ముందుకు సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు కంటే అడ్మిషన్లు, ఫీజుల వసూళ్లపైనే దృష్టి పెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.




**ఆర్భాటమైన పేర్లు... ఆకర్షణీయమైన ప్రకటనలు**

మోడల్ ,ఇంటర్నేషనల్ స్కూల్", "గ్లోబల్ అకాడమీ", "ఒలింపియాడ్ క్యాంపస్", "ఐఐటీ ఫౌండేషన్", "మెడికల్ అకాడమీ", "రెసిడెన్షియల్ గురుకుల్" వంటి పేర్లతో విద్యాసంస్థలు తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. నగరంలోని ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగులు, రోడ్ల వెంట ఫ్లెక్సీలు, ఇంటింటికీ బ్రోచర్లు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో చూపిస్తున్న సదుపాయాలు, వాస్తవ పరిస్థితులు ఒకేలా ఉన్నాయా అనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదని పలువురు తల్లిదండ్రులు అంటున్నారు.

**రంగురంగుల బ్రోచర్లలో ప్రపంచ స్థాయి క్యాంపస్లు**

అత్యాధునిక భవనాలు, డిజిటల్ క్లాస?రీములు, విశాలమైన ఆటస్థలాలు, సైన్స్ ల్యాబ్లు, కంప్యూటర్ ల్యాబ్లు, లైబ్రరీలు ఉన్నట్లు బ్రోచర్లలో ప్రచారం చేస్తున్నారు. కానీ వాస్తవంగా కొన్ని విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఒకే భవనాన్ని వివిధ కోణాల్లో ఫోటోలు తీసి పెద్ద క్యాంపస్లా చూపిస్తున్నారని, మరికొన్ని చోట్ల ఇతర ప్రాంతాల చిత్రాలను ప్రచారానికి వినియోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన**

విద్యా ప్రమాణాలను నిర్ణయించేది ఉపాధ్యాయుల నాణ్యత, అయితే ఖర్చులు తగ్గించుకోవడానికి కొన్ని సంస్థలు తక్కువ వేతనాలతో అనుభవం లేని, తగిన అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు సమాచారం. ఉపాధ్యాయుల నియామకాల్లో పారదర్శకత లేకపోవడం, తరచూ సిబ్బంది మార్పులు జరగడం వల్ల విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతోందని విద్యా నిపుణులు చెబుతున్నారు.

**కిక్కిరిసిన క్లాస్ రూములు... ఊపిరాడని పరిస్థితులు**

విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఒక్కోతరగతి గదిలో నిర్దిష్ట సంఖ్యలోనే విద్యార్థులు ఉండాలి. కానీ కొన్ని విద్యాసంస్థల్లో ఒకే గదిలో 40 నుంచి 50 మంది వరకు విద్యార్థులను కూర్చోబెడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వ్యక్తిగత శ్రద్ధ తగ్గిపోవడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో విద్యార్థుల భద్రతకూ ముప్పు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఫైర్ సేఫ్టీ నిబంధనలకు పాతర**

నిష్క్రమణ మార్గాలు ఇటీవల దేశవ్యాప్తంగా పాఠశాలలు, కోచింగ్ సెంటర్లలో జరిగిన అగ్నిప్రమాదాల నేపథ్యంలో ఫైర్ సేఫ్టీ అంశం కీలకంగా మారింది. నే అయినప్పటికీ కొన్ని విద్యాసంస్థల్లో ఫైర్ . ఎక్స్టింగ్విషర్లు లేకపోవడం, ఉన్నా పనిచేయని స్థితిలో ఉండడం, అత్యవసర లేకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు.

**ఆటస్థలాలు కనిపించవు... విద్యార్థులకు ఆటలు దూరం**

చదువు.. చదువు.. చదువు" అనే నినాదంతో విద్యార్థులను ఉదయం నుంచి రాత్రి వరకు తరగతి గదులకే పరిమితం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. చాలా విద్యాసంస్థల్లో సరైన ఆటస్థలాలు లేకపోవడం వల్ల విద్యార్థులు శారీరక వ్యాయామం, క్రీడలకు దూరమవుతున్నారు.

**అనుమతులు లేకుండానే కొత్త బ్రాంచులు**

కొన్ని ప్రముఖ విద్యాసంస్థల పేర్లతో కొత్త బ్రాంచులు ఏర్పాటు చేసి అడ్మిషన్లు తీసుకుంటున్నప్పటికీ, వాటికి సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన క్యాంపస్కు వచ్చిన గుర్తింపును చూపిస్తూ ఇతర ప్రాంతాల్లో శాఖలు ఏర్పాటు చేయడం వల్ల తల్లిదండ్రులు మోసపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. ట్యూషన్ ఫీజుతో పాటు అడ్మిషన్ ఫీజు, డెవలప్మెంట్ ఫండ్, యాక్టివిటీ ఫీజు, డిజిటల్ క్లాస్ ఫీజు, ట్రాన్స్పోర్ట్ ఫీజు, మెటీరియల్ ఛార్జీలు వంటి పేర్లతో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఫీజులకు జీఎస్టీ బిల్లులు ఇవ్వకపోవడం, నగదు రూపంలోనే చెల్లింపులు తీసుకోవడం వంటి ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.



**ర్యాంకుల ప్రచారంలో నిజమెంత?**

ఫలితాల సమయంలో కొందరు విద్యార్థుల విజయాలను మాత్రమే ప్రచారం చేస్తూ, మొత్తం ఫలితాలపై స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఒక విద్యార్థి వివిధ కోర్సుల్లో సాధించిన ఫలితాలను పదేపదే ప్రచారం చేసి, సంస్థకు వందలాది ర్యాంకులు వచ్చినట్లు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**మొద్దు నిద్రలో విద్యాశాఖ, ఫైర్ శాఖ?**

జిల్లాలో వందల సంఖ్యలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, వాటిపై క్రమం తప్పకుండా తనిఖీలు జరుగుతున్నాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న విద్యా రంగంలో నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించరాదు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, ఉపాధ్యాయుల అర్హతలు, ఫీజుల వ్యవస్థను సమీక్షిస్తేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని విద్యావేత్తలు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. విద్యాశాఖ, ఫైర్ శాఖ సమన్వయంతో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.